# వాన వెలిసింది

త్రై. రఘునాథరావ్

విజయనగరం ప్లాట్‌ఫారం మీద మెడ్రాసునుంచి కలకత్తా పోయే మెయిలు ఆగింది. సంధ్యాసమయం అయినా దట్టంగా మేఘాలు ఆకాశంలో అల్లుకొనివుండడం మూలాన్ని చీకటిగా ఉంది. వర్షం జోరుగా కురుస్తోంది. చినుకులు నీటితో చేసిన గునపాల్లా పొడుస్తున్నాయి. ప్లాట్‌ఫారంమీద ఒకరి మాట ఒకరికి వినిపించడం లేదు. ఒకటవ తరగతి పెట్టెలోంచి అతను దిగేడు. చేతిలో ఒక సూట్‌కేసు ఉంది. వర్షంకోటుతో చలిగాలికి వణుకుతున్నాడు. తడిసిన చేతి రుమాలుతో వాన జల్లుకి తడిసిన ముఖాన్ని తుడుచుకుంటూ స్టేషన్‌వైపు నడిచేడు. 'ఆ సూట్‌కేసు నేనట్టుకొస్తా. నాకో పావలా కాసు పారెయ్యండి' అన్నాడొక రైల్వే కూలీ అతని చేతిలోంచి దాన్ని లాక్కుంటూ. ఓవర్ బ్రిడ్జి దాటి ఇద్దరూ బయటికి వచ్చేక—

'రిక్షా కేకెయ్యనా బాబూ!' అన్నాడు కూలీ.

'వొద్దు. జయపురం బస్సేదీ?' అన్నాడతను.

'ఇయాళ రాలేదండి. దోవలో యక్కడో ఆగిపోయుంటది. ఈ వోరపాని కి గజపతినారం కాడున్న గడ్డ పొంగిపోయుండాల'

అతడు ఒక్క క్షణం ఆలోచించి 'అయితే డాక్ బంగళాకి పద' అన్నాడు. డాక్ బంగళా హాల్లో సూటుకేసు దింపేసి అతడిచ్చిన రూపాయి తీసుకొని ఒక సలాం కొట్టి రైల్వేకూలీ వెళ్ళిపోయేడు. రూపాయినోటు చూడగానే డాక్ బంగళా దర్వాను తడిసిపోయిన సూట్‌కేసుని పైమీద తువ్వాలుతో జాగ్రత్తగా తుడిచేడు. అతడి వర్షం కోటునీ, టోపీని, అతి భక్తితో అందుకొని దులిపి, మూలనున్న కొయ్యకు తగిలించేడు.

'చా తా గు తా రా బాబూ?' అన్నాడు వినయంగా.

'తీసుకురా' అన్నాడతను నీరసంగా ఒక వాలుకుర్చీలో చేరబడి. టీ తాగుతున్నప్పుడు వణుకుతున్న చేతిలోని కప్పు సాసరుమీద టకటకమని కొట్టుకుంది. టీ తాగి జేబులోంచి తాళంచెవి తీసి దర్వానుకిచ్చేడు. 'ఆ సూట్‌కేసులో మీదనే ఒక శాలువ ఉంది. తీసుకురా' అన్నాడు. దర్వానుఇచ్చిన శాలువని కప్పుకొని కళ్ళు మూసుకున్నాడు.

అతడు మళ్ళీ కళ్ళు తెరిచేసరికి వరండాలో ఏవో మాటలు వినిపిస్తున్నాయి. 'గది ఖాళీలేదు బాబూ' అది దర్వాను గొంతు.

'పోనీ లేవోయ్. సావిట్లో నే ఈ రాత్రి గడిపేస్తాం.'

'ఎందుకు చిట్టిబాబూ? ఏదేనా హోటలుకు పోదాం పద'

'హొటలుకి వెళితే మరి దీని సంగతి ?'

వరండానుంచి రెండు గొంతుకలు నవ్వేయి.

'నిజమే సుమా! అయితే లోపలికిపద'

ముగ్గురూ హాల్లోకి వచ్చేరు. వాలుకుర్చీలోని మనిషితో అందులో ఒకాయన 'సార్! మేం కొంచెం భోజనం చేస్తాం. మీకేమీ అభ్యంతరం ఉండదుకద ?' అని అడిగేడు.

'నా అభ్యంతరమేముంది ? కానివ్వండి'

దర్వాను ఒక టిఫిన్ కారియర్ని టేబిలుమీద పెట్టేడు. రెండు గ్లాసుల మంచినీళ్ళు తెచ్చేడు. వాళ్ళిద్దరూ టిఫిన్ కారియర్లోని గిన్నెల్ని వేరుచేసేరు. 'మీరు భోజనం చేసేరా ?' అన్నాడు యింతక్రితం మాట్లాడినాయన వాలుకుర్చీవైపు తిరిగి.

'లేదు.' 'మా దగ్గర వేడి వేడి పూరీలూ, కూరలూ ఉన్నాయి. కొంచెం సాయం పట్టండయితే' అన్నాడతను చిరునవ్వుతో.

'క్షమించండి సార్! నాకు వొంట్లో బాగులేదు.'

'అరెరె! వంట్లో బాగులేక పోతే ఈ దిక్కుమాలిన వర్షంలో డాక్ బంగళాలో ఏం చేస్తున్నారు ఊళ్ళోకి పోక ?'

'నేను జయపురం వెళ్ళాలండి. మెడ్రాసు నుంచి మెయిల్లో వచ్చేను. బస్సు రాలేదు. ఇక్కడ ఉండిపోవాల్సి వచ్చింది.' అతి భారంగా అయాసంతో అన్నాడీ మాటల్ని.


'బాగుంది. దురదృష్ట వంతులం ముగ్గురం ఒక్క దగ్గరే కూడేమన్న మాట. మేమూ జయపురం పోదామని విశాఖపట్నం నుంచి కారులో వస్తూంటే ఈ ఊళ్ళో శుభ వార్త చెప్పేశారు గజపతి నగరం ఏరు పొంగులో ఉందని. అదేమిటి బుచ్చీ! అలా దిక్కులు చూస్తావేం? మొదలు పెట్టూ, ఆలస్యం అయితే పూరీలు చల్లారిపోతాయ్!'

వాళ్ళిద్దరూ భోజనం పూర్తిచేసి సిగరెట్లు ముట్టించేరు.

'ఇక నువ్వు పో' అన్నాడు చిట్టిబాబు దర్వానుతో. వాడు బయటికి వెళ్ళేక తలుపులు గడియవేసి వాలుకుర్చీ దగ్గరకి వొచ్చేడు.

'నిందాకలనుంచి చూస్తున్నాను. తెగ వణుకుతున్నారు దీనికి బయటి శాలువ కప్పుకుంటే ఆగుతుందా ? లోపల వేడిపుట్టాలి సార్! ఘాటైన మందు ఒక మోతాదిస్తాను. ఆ దెబ్బతో మీ వణుకూ, ఉష్ణం బలాదూర్! ఏమంటారు ?'

వాలుకుర్చీలోని వ్యక్తి ఏమీ అనలేదు. నీరసంగా నవ్వేడు. చిట్టిబాబు పాంటు జేబుల్లోంచి రెండు చిన్నగ్లాసులు తీసి టేబిలు మీద ఉంచేడు. 'బుచ్చీ! ఏదీ, ఆ మంచినీళ్ళ గ్లాసందుకో' కోటు జేబులోంచి ఒక సీసా బయటికి తీసి



అందులోని ద్రావకం మూడు గ్లాసుల్లోనూ కొంచెం కొంచెం పోసేడు చిట్టిబాబు. బుచ్చి మంచి నీళ్ళతో గ్లాసులు నింపేడు. ఒక గ్లాసు ఇతడికి అందిస్తూ 'స్మగల్డ్ సార్! హార్బరు ఏరియాలో ఏభైకి చవగ్గా కొట్టేసేను. ఇదే లేబిలు హైదరాబాదులో కొంటే డెబ్భైఅయిదు. ఒక సిప్ లాగిచూడండి. దీని మజా మీకు బోధపడుతుంది.' అన్నాడు చిట్టిబాబు. ముగ్గురూ గ్లాసులు తగిలించేరు.

'టు ద స్పీడీ రికవరీ ఆఫ్ అవర్ న్యూ ఫ్రెండ్!' అన్నాడు చిట్టిబాబు. వాలుకుర్చీలోని వ్యక్తి నీరసంగా నవ్వేడు.

'థేంక్స్. కాని నాకా అదృష్టం లేదుసార్'

'అదేమలా అంటున్నారు?'

'నాకున్న జబ్బు ఒన్ వే ట్రాఫిక్ దీనికి మరి రికవరీ అంటూ లేదు. వాళ్ళిద్దరూ ఒకరి మొఖా లొకరు చూసుకున్నారు, గ్లాసులు ఖాళీ

అయేదాకా ఎవరూ మాట్లాడలేదు. అతను వాలు కుర్చీలోంచి లేచేడు.

'నాకు మీరు అనుమతి ఇస్తే ఇక పోయి పడుకుంటాను' అన్నాడు.

'ఎంతమాట! ఎంతమాట!' అన్నారిద్దరూ.

అతను పోయి గదిలో పడుకున్నాడు.

'పాపం! ఏం జబ్బో ఏమిటో బుచ్చీ! ఓ పని చేద్దాం. వీడుగాని బస్సులో వెళితే తోవలోనే చస్తాడేమో. నా కారులో తీసుకపోదాం' అన్నాడు చిట్టిబాబు.

'నీ ఇష్టం' అన్నాడు బుచ్చి.

మర్నాడు ఉదయం డాక్ బంగళా నుంచి బయలు దేరిన కారు సాలూరు వైపు బయలుదేరింది. బుచ్చి డ్రైవ్ చేస్తున్నాడు. చిట్టిబాబూ తనూ వెనకసీటులో కూర్చున్నారు.

'ఇంతవరకూ మన పరిచయాలు కాలేదు.'

'నా పేరు సుధాకరరావు. అయిదు సంవత్సరాల క్రిందట మీ జయపురం వాడినే. ప్రస్తుతం నా మకాం మద్రాసు. ఉద్యోగం తండ్రి తాతలు గడించిన ఆస్తి తగలేస్తూ ఉండడం. ఇంటర్మీడియట్ చదువుతూ చదువు మానేసేను.'

'భేష్! బాగుంది. ఇంకేం? నా పేరు చిట్టిబాబు. మా ఫ్రండు పేరు బుచ్చి. నేను సివిల్ ఇంజినీర్ని. వీడు ఆటోమొబైల్ ఇంజినేరు. రెండూ ఆనరరీ డిగ్రీలే లెండి. నాటు భాషలో మీకు చెప్పాలంటే నాది కలప వ్యాపారం. మా బుచ్చికి ఒక షెడ్డు ఉంది. అందులో లారీలూ, కార్లూ మరమ్మత్తు చేస్తూ వుంటాడు. నా స్వస్థలం అనకాపల్లి. అక్కడ బెల్లం వ్యాపారంలో దెబ్బతిని జయపురం నాలుగు సంవత్సరాల క్రితం చేరుకున్నాను. ఇక్కడ చిన్న చిన్న కంట్రాక్టర్లతో ప్రారంభించేను. ఏదో ఇప్పుడిప్పుడే కొంత దారినిపడింది నా బండి. ఇక మా బుచ్చి సంగతా? ఇంజను శబ్దం వింటేచాలు. ఎక్కడ డిఫెక్టుందో పట్టేస్తాడు. ఈ చుట్టుపట్ల వీడిలాంటి మెకానిక్కే లేదు.'

'తగ్గు. తగు' అన్నాడు బుచ్చి నవ్వుతూ.

'అయితే యిక్కడో చిన్న తిపిరీ ఉంది. అదేమిటంటే అస్తమానం ఆ గారేజీలో పని చేస్తూ ఉంటే ఎక్కడ డబ్బు గడించేస్తానో అని మనవాడికి భయం. అందుచేత నాలుగురాళ్ళు చేతులో పడగానే దుకాణం కిందివాడికి అప్పజెప్పి నాలాంటి ముక్లెనుగాళ్ళతో ఇలా అటూ ఇటూ చక్కర్లుకొడుతూ ఉంటాడు.' బుచ్చి పకపక నవ్వేడు. సుధాకరరావు అన్నాడు 'మీరు చాలా అదృష్టవంతులు. ఏ చీకూ చింతా లేకుండా హాయిగా కాలం గడుపుతున్నారు.'

'అలా అంటే నేనొప్పుకోను సార్! మా కంట్రాక్టర్ల బతుకులు

మీకేం తెలుసు? నిన్న రాత్రి మీరేమిటన్నారు? మీకున్న జబ్బు వన్ వే ట్రాఫిక్ అని. మాది టూ వే ట్రాఫిక్. అంటే మేం నిత్యం చస్తూ బతుకుతూ ఉంటాం, ఎప్పుడు తేల్తామో తెలీదు." కారుకి అడ్డంగా ఓ రెండెడ్లబండి వచ్చింది. కారు ఆపేడు బుచ్చి. రెండెడ్లబండి వాడిని నాలుగు బూతులు తిట్టేడు చిట్టిబాబు. బండీ తప్పుకుంది. కారు మళ్ళీ స్టార్టు చేస్తే అవలేదు. గుర్ గుర్ మని రెండు మూడుసార్లు గొణుక్కొని ఆగిపోతోంది శబ్దం.

"ఏమయిందిగురూ?" అన్నాడు చిట్టిబాబు.

"బాటరీ డౌనయిపోయింది." అన్నాడు బుచ్చి.

"నేనేం చెప్పేను నిందాకల?" అన్నాడు చిట్టిబాబురావువైపు తిరిగి: "నా బ్రతుకు ఎలాగో నా కారు బతుకూ అలాగే ఉంది. మొన్న విశాఖపట్నం ఒక వారం రోజుల ప్రోగ్రాం వేసుకొని వెళ్ళేం. ఏమయింది? అవతల పార్టీ ఏదో అర్జంటు పనుండి హైదరాబాదు వెళ్ళిపోయేట్టు బస్! ప్రోగ్రాం ఖతమ్! ఇంత పెట్రోలు ఖర్చు దండగ. అయితే ఈ ట్రిప్పులోని ఒక్క బ్రైట్ స్పాట్ ఏమిటంటే ఇది!" అని కోటు లోపలి జేబులోంచి క్రితం రాత్రి బుడ్డీ మళ్ళీ బయటకి తీసేడు. జేబులోంచి ఒక గ్లాను తీసి రావుకి అందించేడు.

"వద్దుసార్! మరి మొహమాటు పెట్టకండి" అన్నాడు రావు.

"బుచ్చీ! గ్లాసందుకో"

"మనం మరి జయపురం వెళ్ళక్కర లేదా?" అన్నాడు బుచ్చి.

"ఒక్క చుక్క కేమీ అయిపో లేదులేవోయ్! ఈ దిక్కుమాలిన ముసురులో ఇది లోపల పడితేనే గాని హుషారుండదు గురూ!"

ఎదురుగా ఒక లారీ వస్తోంది. బుచ్చి చెయ్యి అడ్డంగా పెట్టేడు. లారీ ఆగింది. బుడ్డీ, గ్లానులు చప్పున చిట్టిబాబు జేబుల్లోకి వెళ్ళిపోయేయి.

"ఏటయింది గురూ?"

---

● వెనకటికి దశరథుడు వేటకి వెళ్ళి పొరపాటున ఒక ముని కుమారుణ్ణి చంపేశాడు. వాడి తల్లిదండ్రులు దశరథునికి నువ్వుకూడా మాలాగానే పుత్రవియోగం భరించలేక మరణిస్తావని శాపమిస్తారు. అంత ఘోరశాపం విన్న దశరధుడికి భయంబదులు నవ్వొచ్చిందట. ఎందుకంటే "పుత్రులే లేక ఏడుస్తున్న నాకు మీ శాపం మూలంగానైనా పుత్రులు కలగడం, వారి వియోగంతో నేను మరణించడం జరిగితే అది శాపం కాదు, వరమే" అన్నాట్ట.

'బాటరీ డౌనయిపోయింది. కొంచెం ఎత్తియ్యి!'

కారు మళ్ళీ బయలుదేరేసరికి వర్షం జోరుతగ్గి జల్లుగా కురుస్తోంది. చిట్టిబాబు బుర్ర మళ్ళీ బయటికి లాగి రెండు చుక్కలు లోనికి పోనిచ్చేడు. రావు కునికిపాట్లు పడుతున్నాడు. అతడి నుదుటిమీద చెయ్యి వేసేడు చిట్టిబాబు. నుదురు కాలుతోంది.

ఏటివొడ్డుకి వొచ్చింది కారు.

'అదుగో జయపురం బస్సు!' అన్నాడు చిట్టిబాబు.

బస్సు గడ్డమధ్యలో ఉంది. బస్సులోని జనమంతా ఇవతలి వొడ్డున నిల్చున్నారు. బస్సులో డ్రైవరొక్కడే కూర్చున్నాడు. దాన్ని తాళ్ళు వేసి లాగుతున్నారు కొందరు. వెనకనుంచి మరికొందరు తోస్తున్నారు. అక్కడున్న ప్రతిమనిషి తాడు లాగుతున్నవాళ్ళకి డ్రైవరుకి ఏదో ఒక సలహా ఇస్తూనేఉన్నాడు. కొందరు గట్టిగా అరుస్తున్నారు. ఆ జాగా అంతా చాలా హడావిడిగా ఉంది. ఎలాగైతేనేం బస్సు ఇవతలి తీరానికి చేరింది. అందరూ మళ్ళీ బస్సెక్కేరు.

'కరెంటెలాగుంది గురూ?' అడిగేడు బుచ్చి,

'నీరు తీసేసింది. ఇక ఫరవాలేదు.' అన్నాడు బస్సులోని డ్రైవరు. బస్సు విజయనగరం వైపు వెళ్ళిపోయింది. కారు స్టార్టు చేసేడు బుచ్చి. ఏట్లో సగం దూరం దాకా బాగానే వెళ్ళింది కారు. అక్కడినుంచి మరి ముందుకి వెళ్ళలేదు. ప్రవాహం పక్కకి నెట్టుతోంది కారుని చిట్టిబాబుకి ముచ్చెమటలు పోసేయి. రావు తాపీగా అడిగేడు; 'ఒకవేళ కారు ముందుకి పోలేక ఈ ప్రవాహం జోరు ఎక్కువైపోతే ఏమవుతుంది?' 'ఏమవుతుంది? మీరూ నేనూ ఛస్తాం. బుచ్చికి ఈత వొచ్చు కాబట్టి వాడెలాగో ప్రాణాలతో బయట పడతాడు.' అన్నాడు చిట్టిబాబు. రావు సంతృప్తిగా నవ్వుకొని వెనక్కి చేరబడ్డాడు.

'అవును, మీకు చావంటే నవ్వులాటగా వుంది. నాకు మాత్రం అప్పుడే చావాలని లేదు' కారు మరి కొంచెం పక్కకి జరిగింది.

'బుచ్చి! నా కొంప ముంచకు. ఆ గాడిద కొడుకులు చూడు, వొడ్డున కూర్చుని ఎలా



చూస్తున్నారో! ఒరే! మా అమ్మ కడుపు కాల! ఇరవై రూపాయలిస్తాను రండి.' గట్టిగా అరిచేడు చిట్టిబాబు

ఏటివొడ్డున తీరిగ్గా చుట్టకాల్చుకుంటున్న ముసలాడు 'ఏభైకి తక్కువైతే లాగమండి. కరెంటు మా జోరుగా ఉంది.' అన్నాడు.

కారు మరికొంచెం పక్కకి జరిగింది.

'ముప్ఫై తీసుకో' అన్నాడు చిట్టిబాబు

ముసలాడు దీనికి జవాబే ఇవ్వలేదు. పక్కనున్న వాడితో 'అల్లదుగో ఆ పెద్ద కెరటం మూసేవా? మరో నిమిషానికి కారూ, బాబులూ ఖలాస్!' అని చుట్టలోంచి మరో దమ్ము లాగేడు.

'నీ ఏభై మండిపోను! అలాగే ఇస్తాను రండి.'

కారు ముందుకి జరిగింది. చిట్టిబాబు సంతోషంతో కేకలేశాడు. 'కదిలింది. కదిలింది. ఎడంవేపుకి కొయ్! అన్నాడు బుచ్చితో. బుచ్చి సమాధానం ఇవ్వలేదు. కారు మరికొంచెం ముందుకి జరిగింది. మరో కొన్ని క్షణాల్లో అవతలి తీరం చేరుకుంది.

'మా సేవా ముసలోడా! అత్యాశకి ఎప్పుడూ పోకు! అన్నాడు చిట్టిబాబు కసిగా. ముసలాడు చుట్టతీసి కోపంతో నేలకి కొట్టేడు. 'చెప్పేను కదండీ. మా బుచ్చి అంటే ఏమిటనుకున్నారు? ఈ జిల్లాలో మా వాడిలా డ్రైవ్ చెయ్యగలవాడేడీ?' అన్నాడు రావుతో చిట్టిబాబు.

గజపతినగరం వచ్చింది 'రావుగారూ! వర్షం తగ్గింది, దిగండి. ఇక్కడ నాకు తెలిసిన డాక్టరొకాయన ఉన్నారు. ఒక్క పెన్సిలిన్ మీకు పడితేనేగాని ఈ టెంపరేచరు తగ్గదు.'

'మీకు చాలా థేంక్స్. కాని నాకేమీ అక్కరలేదండి. నన్నిలాగే చావనివ్వండి. నాగురించి మీరేమీ శ్రమపడొద్దు. నన్ను జయపురం చేరిస్తే చాలు. మీ ఋణం వచ్చే జన్మలో తప్పక తీర్చుకుంటాను.'

చిట్టిబాబు, బుచ్చి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. బుచ్చి కారుని ముందుకు పోనిచ్చేడు. సాలూరులో బుచ్చి, చిట్టిబాబు భోజనాలు చేసేరు. రావు కాఫీ తాగేడు. సాలూరు దాటి కారు కొండ ఎక్కడం ప్రారంభించింది.

'ఇంతకీ మీ జబ్బేమిటో చెప్పేరుకాదు.' అడిగేడు చిట్టిబాబు.

రావు నిట్టూర్చేడు. 'ఏమని చెప్పమంటారు? ఇది ప్రపంచలో ఏ డాక్టరూ కుదర్చలేని జబ్బు. దీనికి మందులేదు. దీనిని మనో వ్యాధి అంటారు' అన్నాడు.

అలా కొన్ని క్షణాలు రావువేపు నోరుతెరిచి చూసి గట్టున నవ్వడం మొదలుపెట్టేడు చిట్టిబాబు. పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వేడు.

'పోరినీ! నువ్వుగాని కథలూ కవిత్వాలూ రాసేవాడివి కావు గద!'

'నవ్వండి. నా బ్రతుకే నవ్వుల పాలయింది. మీ కేమిటి? రేపు నేను చచ్చేక నా శవాన్ని చూసి లోకమంతా నవ్వాలి. నా వంటి పాపాత్ముడికి ఈ శాస్తి జరగవల సిందే!' అన్నాడు రావు భారంగా తలని రెండు చేతులతోనూ పట్టు కుంటూ.

'మాడు తమ్ముడూ! మాంఛి వయస్సులో ఉన్నావు. నీకు చావా ల్సిన ఖర్మేం? నువ్వు మరోలా అనుకోకపోతే నీ కథేమిటో నాకు చెప్పు. జీవితంలో బాగా ఢక్కా మొక్కిలు తిన్నవాణ్ణి నీ జబ్బుకి మందు నే నిస్తాను.'

చాలా సేపటి వరకూ రావు మాట్లాడలేదు. చివరికి ప్రారంభిం చేడు.

'చిట్టిబాబుగారూ! నేనో అమా యకురాలికి అన్యాయం చేసేను ఒక అమ్మాయిని బలాత్కారంగా చెరిచేను. ఇది ఐదు సంవత్సరాల క్రిందటి మాట. వాళ్ళు ఊరవతల చక్కటి బంగళాలో ఉండేవారు. నేనూ ఆ అమ్మాయీ కాలేజీ లో చదువుతూ వుండేవాళ్ళం. వాళ్ళ కుటుంబం చాలా ఫార్వర్డ్‌గా ఉండేది. నేను వాళ్ళ యింటికి వస్తూ పోతూ ఉండేవాణ్ణి. ఒక నాడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒకానొక మానసిక దౌర్బల్యంలో, కామోద్రే కంలో ఆ అమ్మాయి శీలాన్ని నేను మంట గలిపేను. ఆ వేడి చల్లారిన మరుక్షణంలో నాకు పోలీసులూ జైలూ కళ్ళకికట్టి స్పృహతప్పి పడి వున్న ఆ అమ్మాయిని అక్కడ వొదిలి మద్రాసు పారిపోయేను. అలా పారి పొమ్మని సలహా యిచ్చినవాడు మా నాన్న. మద్రాసులో ఈ అయిదు సంవత్సరాలూ అజ్ఞాతంగాగడిపేను. కాని అనాడు జరిగిన సంఘటన మాత్రం నన్ను పిశాచంలా వెంటా డింది. అది మర్చిపోవాలని ఎన్ని ప్రయత్నాలు చేసేనో ఆ భగవంతు డికి తెలుసు! అకలి వెయ్యదు. నిద్ర

---

● రాబర్ట్ సథే అని ఒక ఇంగ్లీషు కవి వుండేవాడు. అతడు తను షేక్స్పియర్, మిల్టన్‌లంత గొప్ప కవినని తను అనుకోవడమే కాక, ఆ విషయం ఇతరులతో కూడా చెప్పేవాడు. అతని స్వోత్కర్ష వినలేక బోరుకొట్టిన ఒక విమర్శకుడు 'అయ్యా, నిజంగా మీరు గొప్ప కవులే. షేక్స్పియర్, మిల్టన్‌ల కవిత్వాన్ని మరచిపోయిన తరవాత మాత్రం జనం మీ పద్యాలు చదువుతారు. సరేనా?'

పట్టుడు. అలా క్రుంగి కృశించి చివరకి ఈ స్థితికి వొచ్చేను. ఈమధ్య మా నాన్న పోయేడు. దానితో ఇన్ని సంవత్సరాలూ నన్ను నీడలా అంటి ఉన్న అతడి సంరక్షణ వదిలి పోయింది. అప్పుడు జయపురంలోని ఒక ఆప్తమిత్రుడికి ఉత్తరం ఒకటి రాసేను. ఆ అమ్మాయి ప్రస్తుతం ఎక్కడుందో కనుక్కొని రాయమని. ఆవిడ ఇంకా ఈ ఊళ్లోనే ఉంది. అతడామెను రహస్యంగా కలుసుకుని నా ఉత్తరం అందించేడు. ఆమె నాకు జవాబు రాసింది. ఆ జవాబు రాసిన తర్వాత నా గుండెలు పగిలేలా ఏడ్చేను. నేను పారిపోయిన తర్వాత వాళ్ళ నాన్న పోలీసుకి రిపోర్టు ఇవ్వలేదు. కుటుంబ గౌరవానికి భంగం వస్తుందని ఆయన భయపడ్డాడు. ఆ అమ్మాయికి గుట్టుచప్పుడు కాకుండా పైఊరినుంచి ఒక బీద కుర్రాణ్ణి తీసుకొచ్చి పెళ్ళి చేసేసేడు. వాళ్ళిద్దర్నీ మరో ఊరులో కాపురం పెట్టించేడు. కాని విధి చాలా క్రూరమైంది. ఆ అమ్మాయికి పెళ్ళయిన ఆరు నెలలకి ఒక మొగ శిశువు పుట్టేడు. ఆమె భర్త ఆమెను నిలదీసేడు. ఆమె జరిగిన యథార్థం చెప్పింది. కాని అతడు నమ్మలేదు. యవ్వనపుమైకంలో ఆమె పూర్తిగా కళ్ళు తెరిచిచేసిన పాపం అని నిర్ధారణ చేసుకున్నాడు. తండ్రితో కలిసి ఆమెకూడా తనని మోసం చేసిందనుకున్నాడు. అప్పుడతడామెకు విధించిన శిక్ష ఏమిటో తెలుసా? ఆమెను తీసుకొని జయపురం వచ్చేడు. ఈ ఊళ్ళో కాపురం పెట్టేడు. ఆమెను బొట్టు పెట్టుకోనివ్వేడు. గత అయిదు సంవత్సరాలూ ఆమె భర్త ప్రేమకి దూరమై జీవచ్ఛవంలా తయారయింది. ఆమె తండ్రిమీద అతను తీర్చుకున్న పగ అది. అల్లారుముద్దుగా పెరిగిన ఒకే ఒక కూతురు బ్రతుకిలా బూడిద పాలవడంచూసి ఆమె తండ్రి గుండెజబ్బుతో మంచ మెక్కేడు. ఇప్పుడామెకు జీవితం మీదే విరక్తి పుట్టింది. ఈ నరకంనుంచి విముక్తి పొందాలంటే ఒకటే మార్గం. ప్రాణత్యాగం చేసుకోవడం. కాని ఏ పాపమూ ఎరుగని తన కుర్రవాడి గతిఏమిటి? అందుచేత చేసిన పాపానికి నేను నిజంగా పశ్చాత్తాపపడితే ఈ ఆఖరి ఉపకారం తనకి చేసిపెట్టమంది. అదేమిటంటే నా వెంట ఆ కుర్రవాణ్ణి తీసుకొనిపోవడం. అప్పుడామె నిశ్చింతగా ప్రాణాలు వదలగలదు." ఆయాసంతో రావు వెనక్కి చేరబడ్డాడు. కాస్సేపు పోయేక మళ్ళీ మొదలుపెట్టేడు.

"నాకీ జీవితం మీద ఏనాడో రోత పుట్టింది. అందుచేత ఇప్పుడు ఆ కుర్రవాణ్ణి మద్రాసు తీసుకొనిపోతాను. వాడికి నా ఆస్తి అంతా రాసేసి అప్పుడు తేలిగ్గా నా ప్రాణాలు వదుల్తాను. నా కిప్పుడొక్కటే భయం పట్టుకుంది. అంతవరకు నేను బ్రతికి ఉండగలనా లేదా అని! చూడండి. నా కళ్ళు అప్పుడే

తిరుగుతున్నాయి. కడుపులో ఏదో బాధగా ఉంది.'

'బుచ్చీ! కారు సైడుకి తీసుకెళ్ళి ఆపు' అన్నాడు చిట్టిబాబు. కారు ఆగింది.

'చూడు తమ్ముడూ! ఘాటీ ప్రయాణంవల్ల నీకు తిప్పుతోంది. అంతేగాని నీ ప్రాణం ఏమీ పోవడం లేదు. కిందకి దిగి శుభ్రంగా వాంతి చేసుకో. అంతా సర్దుకుంటుంది.' అని రావుని కిందకు దింపేడు చిట్టిబాబు. పది నిమిషాల తర్వాత రావు తిరిగి వచ్చేడు. కారులోంచి వాటర్ బాటిల్ తీసి 'ఇందులో నీరు పుక్కిలించి మొహం కడుక్కో' అన్నాడు చిట్టిబాబు. తర్వాత 'ఎలాగుంది?' అన్నాడు.

'కాస్త సర్దుకుంది' అన్నాడు రావు.

'ఇహ లోపలికి పద. లేకపోతే ఈ జల్లుకి జలుబు చేస్తుంది.'

రావు నుదుటి మీద చెయ్యి వేసేడు. చల్లగా ఉంది.

'చూసేవా? టెంపరేచరు కూడా తీసేసింది. నీకు చావేం వొచ్చిందయ్యా? పూలరంగడిలా ఉన్నావు. ఆ గుంట చూపు కెలా ఉంటుంది? అదే! నీ అమ్మాయి!'

'గులాబి పువ్వు ఎలా ఉందంటే ఏమిటి సమాధాన మివ్వమంటారు?'

'భేష్! ఇంకేం? మరేమీ ఆలోచించకు. ఆ అమ్మాయినీ, కుర్రాణ్ణి తీసుకొని మెడ్రాను ఉడాయించేయి. ఇదుగో! కావలిస్తే నేనూ బుచ్చి మిమ్మల్ని విజయనగరం దాకా దిగబెట్టి మెడ్రాను మెయిలెక్కిం చేస్తాం. ఏమంటావు బుచ్చి?'

'ఓ అలాగే!' అన్నాడు బుచ్చి.

'ఏమన్నారు?' అన్నాడు రావు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి.

'ఏం నీకు చెముడా?' అన్నాడు చిట్టిబాబు,

'మరి ఆమె భర్త సంగతి?'

'ఆ దౌర్భాగ్యుడి గొడవ నీ కెందుకు? అయిదు సంవత్సరాలు దాన్ని సుఖపెట్టలేని చవట నా పెళ్లాం ఎవడితోనో లేచిపోయిందోయ్ అని ఏడుస్తూ కూచుంటాడా దీని పీడ

---

● రాబర్ట్ బ్రౌనింగ్ కవిత్వమంటే చెవికోసుకునే కొందరు మిత్రులు ఒకసారి అతనిదగ్గరికెళ్ళి ఒక పద్యంలో కొన్ని లైన్లు తమకు అర్థం కాలేదని, వివరించమని కోరారు.

బ్రౌనింగ్ ఆ పద్యం మళ్ళీమళ్ళీ చదివి 'సారీసార్. ఆ లైన్లు రాసి నప్పుడు నాకూ, దేవుడికే అర్థం తెలును, ఇప్పుడు దేవుడి కొక్కడికే తెలును' అన్నాడు.

విరగనై పోయిం దనుకుంటాడు. ఏమంటావు బుచ్చీ?'

'కరెక్ట్!' అన్నాడు బుచ్చి

రావుచప్పున లేచికూర్చున్నాడు. 'మీా కోటు జేబులోని మందు ఏమైనా మిగిలిందా?' అన్నాడు.

'ఇదుగో!' అని సీసా అందించేడు చిట్టిబాబు. సీసా ఎత్తి రెండు గుక్కలు లోనికి పోనిచ్చేడు రావు. చిట్టిబాబు ఇచ్చిన సిగరెట్టు ముట్టించి లోపలికి దమ్ము పట్టి ముక్కు లోంచి పొగ వదిలేడు. కారు హుషారుగా ముందుకు సాగింది. చలి బాధకి తట్టుకోలేక చుట్టూఉన్న కొండలు దట్టమైన మేఘాల్ని కప్పుకున్నాయి. కొండ మీాద వాగొకటి యవ్వనపు పొంగుతో గంతులేస్తూ గలగలమని నవ్వుతోంది.

'ఆహా! ఈ ప్రకృతి సౌందర్యం ఎంత రమణీయంగా వుంది!' అనుకున్నాడు సుధాకరరావు.

కొండల్లోంచి కిందికి దిగి జయపురం ఊరి పొలిమేరల్ని సమీాపించింది కారు. 'డిపోలోకి పోనియ్' అన్నాడు చిట్టిబాబు. మధ్యాహ్నం రెండుగంటల సమయం. కాని కారు మబ్బులమూలంగా కాలం తెలియడంలేదు. చిట్టిబాబు కలప డిపోకి ఒకవైపున అవుట్ హౌస్ ఒకటుంది. అక్కడ కారు ఆపేడు బుచ్చి. ముగ్గురూ కారుదిగేరు. జేబులోని తాళం చెవితో అవుట్ హౌస్‌కి వేసి




ఐ టెక్స్

సౌందర్యానికి సహాయకారులు

* ఐటెక్స్ కాటుక
పసిపిల్లలకు కూడా చాలా మంచిది

* ఐటెక్స్ బింది
కంటికింపైన రంగులలో లభించును.

* ఐటెక్స్ కుంకుం పేస్టు.




అరవింద్ లేబొరేటరీస్,
పి. బి. 1415 — మద్రాసు—17.

ఉన్న తాళం తీసేడు చిట్టిబాబు. ఒక చావడి, గది, బాత్ రూం వున్నాయి ఆ యింట్లో. ముగ్గురూ చావడిలోఉన్న కుర్చీలలో కూర్చు న్నారు.

'ఆ బాత్‌రూంలోకి వెళ్ళి గడ్డం గీసుకో. తర్వాత రెష్టు తీసుకో. చీకటిపడ్డాక మొఖం కడుక్కొని, బాగా ముస్తాబై టిప్‌టాప్‌గా తయారైవెళ్ళు, ఆ మొగుడి సంగతి ఏమని రాసింది ఉత్తరంలో?' రావు నడిగేడు చిట్టిబాబు.

'అతను ఊళ్ళో ఇవాళ ఉండడు అని ఉత్తరంలో రాసింది' అన్నాడు రావు.

చీకటి పడింది. రావు వెళ్ళి సుమారు ఒక గంట కావస్తోంది. కాలుకాలిన పిల్లిలాగు అటూ ఇటూ తిరుగుతున్నాడు చిట్టిబాబు. సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తున్నాడు. 'ఏడీ మనవాడు? ఇంకా రాడేం? కొంపతీసి వీళ్ళిద్దరూ వస్తూంటే తోవలో ఎవరైనా పసికట్టి పట్టు కున్నారా ఏమిటి?'

బుచ్చి ఒక సోఫాలో తీరికగా కూర్చొని ఈ హడావిడంతా చూస్తు న్నాడు 'నువ్వెందు కలా మధ్య కంగారు పడతావ్? చీకటి! పైగా చిటపటమని చినుకులు. ఎవరు పోలుస్తారు లెద్దూ! అదుగో వస్తున్నాడు' అన్నాడు రోడ్డు వైపు చూసి.

కాని రిక్షాలో సుధాకరరావు ఒక్కడే ఉన్నాడు. రిక్షాడబ్బులిచ్చి తలవంచుకొని తాపీగా కాళ్ళీడ్చు కుంటూ వచ్చేడు.

'ఏమయింది?' అన్నారిద్దరూ ఒక్కసారిగా. అతడొక వేడి నిట్టూర్పు విడిచి 'రానంది' అన్నాడు ఒక సోఫాలో కూలబడుతూ.

'నా కా ఉత్తరం రాసేక తన తెలివి తక్కువ తనానికి విచారించిందట. జీవితానికి ఎన్నడూ భయపడి పారిపోకూడదంది. తన ఆత్మహత్య ప్రయత్నం మానుకుంది. ఏనాడైనా తనభర్త తనవైపు మొగ్గుతాడేమో అన్న ఒక్క ఆశతోనే జీవితం అంతా గడిపేస్తానంది. ఇంకో విషయం చెప్పింది. అతణ్ణి ఎంతో గాఢంగా ప్రేమించిందట. అతడామెను ఈ కారణంచేత తృణీకరించినా, మనిషిలో ఉదాత్తత ఉందంటుంది, నేనంటే అసహ్యం తప్ప మరో భావన లేదంది. కాని నా స్థితినిచూసి జాలిపడింది. నన్నూ వెర్రి మొర్రి ఆలోచనలు పెట్టుకోక ఎవరినైనా పెళ్ళి చేసుకొని సుఖపడమంది' కన్నీరు రుమాలుతో తుడుచు కున్నాడు రావు.

'మరి కుర్రవాడి సంగతి?'

'తను బ్రతకదలచుకున్నప్పుడు కుర్రవాడి ప్రసక్తి మరి ఎక్కడుంది? మే మిద్దరం మాట్లాడుతున్నంత సేపూ వాడు తల్లిని చుట్టుకొని కూర్చున్నాడు. అప్పుడే అను కున్నాను. వీళ్ళిద్దరూ వేరు కావడం అసాధ్యం అని.'

చాలా సేపటివరకు ఎవరూ మాట్లాడలేదు, చివరకి చిట్టిబాబు అన్నాడు. 'అయితే మీరు రిప్పుడేం చేస్తారు?'

'భయపడకండి. నేను మరి చావను. ఈ ఒక్క రోజు పరిచయం లోనూ మీరు నాకు జీవితం మీద ఆశ మళ్ళీ కలిగించేరు. ఆమె జీవితం లోని అర్థాన్ని నాకు బోధపరిచింది. మీ ఇద్దరికీ ఆజన్మాంతం కృతజ్ఞుణ్ణి. రేపే తిరిగి మద్రాసు వెళ్ళిపోతాను.'

'సరే రేపటిదాకా మీ రిక్కడే ఉండండి. మేం ఇళ్ళకి పోతాం. మళ్ళీ రేపు పొద్దున్న కలుద్దాం' అన్నాడు చిట్టిబాబు.

'అలాగే థేంక్ యు వెరిమచ్.'

'దానికేం లెండి! పద బుచ్చి!'

ఇద్దరూ కారులో కూర్చున్నారు. 'నన్ను మార్కెట్టులో దింపెయ్' అన్నాడు బుచ్చి. బుచ్చిని మార్కెట్టులో దింపేసి కారులో వెళిపోయేడు చిట్టిబాబు. చినుకులు ఆగిపోయేయి. మబ్బులు చెదిరి వెన్నెల ఊరంతా చల్లగా పరుచుకుంది. నీటి గాలి గిలిగింతలు పెడుతోంది. సంపెంగ పువ్వుల దండొకటి మార్కెట్టులో కొని ఇంటివైపు దారితీసేడు బుచ్చి.

తలుపు తట్టేడు. అతడి భార్య తలుపుతీసి బుచ్చిని చూసి నిర్ఘాంతపోయింది. 'మీరా! వారం రోజుల తర్వాత వస్తానన్నారు?' అంది ఆశ్చర్యంగా.

'విశాఖపట్నం ప్రోగ్రాం కేన్సిల్ అయిపోయింది. తిరిగి వచ్చేసేం. అదేమిటి. మొగుడింటికొస్తే ఇలాగేనేమిటి స్వాగతం ఇవ్వడం? నుదుటను బొట్టేదీ? ఆ మాసిన చీరేమిటి? తలేనా దువ్వుకున్నావు కావు, నీకోసం సంపెంగ పువ్వులు తెచ్చేను. మన బాబేడీ? అరె! ఏడుస్తున్నావా? ఎందుకూ?'

□□□

